**Namaste Telangana**

# మూడేండ్లలో లక్ష ఉద్యోగాల భర్తీ

- ప్రభుత్వ నియామకాల్లో ప్రతిభకే పట్టం
- గోల్‌మాల్ స్థానంలో పారదర్శకత తెచ్చాం
- మునిసిపల్ శాఖమంత్రి కేటీఆర్
- కొత్త టౌన్‌ప్లానింగ్ అధికారులకు నియామక పత్రాలు అందజేత
- ప్రలోభాలకు లొంగకుండా పనిచేయాలని హితవు
- టౌన్‌ప్లానింగ్‌కు నూతన జవసత్వాలు: కేటీఆర్



కొత్తగా నియమితులైన టౌన్‌ప్లానింగ్ అధికారులతో మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, వివేకానంద్, అరికెపూడి గాంధీ, పురపాలక శాఖ సంచాలకులు దాన కిశోర్ ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించగానే ముఖ్యమంత్రి కేచంద్రశేఖర్‌రావు ఐదేండ్లలో లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తామని మాట ఇచ్చారని, మరో మూడేండ్లలో ఈ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. మంగళవారం సీడీఎంఏ కార్యాలయంలో కొత్తగా నియమితులైన 105 టౌన్ ప్లానింగ్ అధికారులకు నియామక పత్రాలను అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టౌన్‌ప్లానింగ్‌కు నూతన జవసత్వాలు తీసుకువస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్వీస్ కమిషన్ ఉద్యోగాలంటే ఇంటర్వ్యూ వరకూ వెళితే చాలు.. ఏదోరకంగా తిమ్మిని బమ్మిని చేసి ఉద్యోగం సంపాదించే సంప్రదాయముండేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత.. పైసా లంచం ఇవ్వకుండా ప్రతిభతోనే ఉద్యోగాలు సంపాదిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నియామకాల్లో పూర్తిస్థాయి పారదర్శకత వచ్చిందనడానికి ఇంతకన్నా నిదర్శనమేం కావాలని అన్నారు. సిరిసిల్లలో తనకు బాగా పరిచయమున్న వ్యక్తి తన తమ్ముడికి ఉద్యోగం కావాలని అడిగినా తాను సిఫారసు చేయలేదని, ప్రతిభ ఉంటే తప్పకుండా వస్తుందని చెప్పానని సభాముఖంగా తెలిపారు. ఎలాంటి రికమెండేషన్లు లేకుండా తన కూతురికి టీఎస్‌పీఎస్సీ నేరుగా నియామక పత్రాన్ని పంపిస్తే ఓ సీనియర్ జర్నలిస్టు ఆశ్చర్యపోయాడని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. కేవలం అనుమతుల మంజూరుకే పరిమితం కాకుండా నగరాలు, పట్టణాలను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని తాజాగా నియామక పత్రాలు పొందిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లకు ఉద్బోధించారు. 'నగరమనేది యాదృచ్ఛికంగా ఏర్పడింది కాదని.. అది ఓ స్పష్టతతో, నిర్దిష్టమైన లక్ష్యంతో రూపొందాలన్న' అమెరికన్ ఆర్కిటెక్ట్ లియాన్ క్రయర్ మాటలను మంత్రి ఈ సందర్భంగా ఉటంకించారు. మనదేశంలో ప్రణాళికాబద్ధమైన నగరమంటే ప్రప్రథమంగా గుర్తుకొచ్చేది చండీగఢ్ మాత్రమేనని.. నయా రాయపూర్, అమరావతి కూడా అదేరీతిలో అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. నిజానికి, గత కొన్నేండ్ల నుంచి దేశంలో హైదరాబాద్‌తో సహా ఏ ఇతర నగరాలూ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందలేదని కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 38 శాతమున్న నగర ప్రాంతం అతిత్వరలో యాభై శాతానికి చేరడానికి పరుగులు పెడుతున్నదని చెప్పారు. ఇటీవల నగరానికి విచ్చేసిన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో మాట్లాడితే.. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాలో కేవలం ఎనభై నగరాల నుంచే అధిక ఆదాయం లభిస్తున్నదని చెప్పారని మంత్రి వివరించారు. తెలంగాణకు అరవై శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే లభిస్తుందని, పట్టణీకరణ పెరిగేకొద్దీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. టౌన్ ప్లానింగ్ ఉద్యోగాలంటేనే కొందరు వ్యక్తులు రకరకాల ప్రలోభాలకు గురి చేస్తుంటారని.. కాబట్టి, కొత్తగా ఎంపికైన ఉద్యోగులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ఉద్యోగుల కంటే మన రాష్ట్రంలో పేస్కేల్ అధికంగా ఉంది కాబట్టి, పక్కదారులు పట్టకుండా నిజాయితీతో విధులను నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా, ఎవరెన్ని ఇబ్బందులకు గురి చేసినా.. మొక్కవోని పట్టుదలతో, మానసిక స్థైర్యంతో వాటిని అధిగమించాలని సూచించారు. 'సీనియర్ ఉద్యోగులూ అప్పుడప్పుడు ఒత్తిడికి గురి చేస్తుంటారు. వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని సమర్థవంతంగా పనిచేయాలి. పైఅధికారి చెప్పాడనో.. పక్కనున్న అధికారి చెప్పాడనో.. ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా పని చేయకూడదని ఓ పెద్దన్నలా సలహా ఇస్తున్నా' అని మంత్రి చెప్పారు.

### దురాక్రమణలకు అడ్డుకట్ట

ప్రతిఒక్కరూ విధిగా మున్సిపల్ ఆస్తులు దురాక్రమణకు గురికాకుండా కాపాడాలని, మున్సిపల్ లేఅవుట్లకు గ్రీన్ ఫెన్సింగ్ సిద్ధం చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విధుల్ని నిర్వహించాలని చెప్పారు. జూన్ 2 నుంచి ఆన్‌లైన్‌లో భవన నిర్మాణాలకు అనుమతులనిచ్చే ప్రక్రియను ఆరంభించామన్నారు. అయితే, కొత్త మార్పులకు అలవాటు పడటానికి మరికొంత సమయం పడుతుందన్నారు. తమ సమస్యను చెప్పుకోవడానికి వచ్చే సామాన్యుల పట్ల విసుగు చెందకూడదని సూచించారు. వారు చెప్పే సమస్యను పూర్తిగా విని పరిష్కరిస్తే మనసుకెంతో తృప్తి కలుగుతుందన్నారు. నిరుపేదల పట్ల దయార్ద్ర హృదయంతో పని చేయాలన్నారు.

### భవిష్యత్తు కోసం ప్రణాళిక

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతి పట్టణానికి విడిగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆయా పట్టణం ఎలా ఉండాలి? వెజ్ మార్కెట్లు, నాన్ వెజ్ మార్కెట్లు, చెరువులు, శ్మశానవాటికలు.. ఇలా ప్రతి అంశాన్ని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీపీ హెడ్ ఆనంద్ బాబు మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్ విభాగంలో 123 ఖాళీలను గుర్తించగా.. అందులో 105 మందిని ఎంపిక చేశామని.. ఇందులో జోన్-5 నుంచి 53 మంది, జోన్-6 నుంచి 52 మంది ఎంపికయ్యారని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలో భాగంగా.. 37 పట్టణాల మాస్టర్ ప్లాన్లు, 11 అమృత్ పట్టణాలు, రెండు టెంపుల్ టౌన్ల బృహత్ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. మొత్తం రాష్ట్రానికి వర్తించేలా టౌన్ ప్లానింగ్ చట్టం, అడ్వర్టయిజ్‌మెంట్ పాలసీని రూపొందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, జూబ్లీహిల్స్, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, వివేకానంద్, అరికెపూడి గాంధీ, పురపాలక శాఖ సంచాలకులు దానకిశోర్ పాల్గొన్నారు.